GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 306 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం 12.05.2025 | పేజీలు : 3




# ఉగ్రవాదులను భారత్‌కు అప్పగిస్తేనే చర్చలు

- ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**టీ మీడియా, మే 11,-ఢిల్లీ:** పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించే ఒప్పందంపై జరిగిన చర్చ సందర్భంగా, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో మాట్లాడారు. పొరుగు దేశంతో చర్చించాల్సిన ఏకైక విషయం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) తిరిగి రావడం మాత్రమే అని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. అలాగే పాకిస్తాన్ ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపైనే మాత్రమే చర్చలు జరుగుతాయని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు.భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేశారు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై సుదీర్ఘంగా చర్చించారు. కాల్పుల విరమణ దిశగా పాకిస్థాన్‌ను ఒప్పించేందుకు తాము సిద్ధమని జేడీ వాన్స్ మోదీకి వివరించారు. దీనికి మోదీ ప్రతిస్పందనగా.. మరోసారి నిబంధనలు ఉల్లంఘించి పాక్ కాల్పులు జరిపితే.. తాము మౌనంగా ఉండబోమని.. ధీటుగా బదులిస్తామని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ తేల్చి చెప్పారు.కాశ్మీర్ విషయంలో మాకు చాలా స్పష్టమైన వైఖరి ఉంది, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ తిరిగి రావడం అనే ఒకే ఒక విషయం మిగిలి ఉంది. ఇంకేమీ మాట్లాడటం లేదు. అలాగే ఉగ్రవాదులను అప్పగించడం గురించి వారు మాట్లాడితే, మనం మాట్లాడుకోవచ్చు. నాకు వేరే ఏ అంశం ఉద్దేశం లేదు" అని ప్రధాని మోదీ, జేడీ వాన్స్‌తో చెప్పినట్లు సమాచారం. ఈ అంశంపై భారతదేశం ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "మేము ఎవరూ మధ్యవర్తిత్వం వహించాలని కోరుకోవడం లేదు. మాకు ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదు" అని ఆయన చెప్పినట్లు సమాచారం.రెండు దాయాది దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రత్యక్షంగా ప్రస్తావిస్తూ, పాకిస్తాన్ దాడులు జరిగిన అదే రాత్రి, భారతదేశం పాకిస్తాన్ అంతటా 26 స్థావరాలపై దాడులు చేసి ప్రతీకారం తీర్చుకుంది. భారతదేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలనే దృఢ సంకల్పాన్ని ప్రదర్శించింది.భారతదేశం, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య, రెండు దేశాలు ఒకదానికొకటి సైనిక కదలికలను నిశితంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు. అంతర్జాతీయ సమాజానికి, పాకిస్తాన్‌కు ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారు. భారతదేశం సరిహద్దు దాడులను సహించదని, అలాంటి ఏవైనా చర్యలను అధిక శక్తితో



ఎదుర్కొంటామని ప్రదాని మోదీ వెల్లడించారు. ఈ పరిణామం, సరిహద్దు ఉగ్రవాదం, రెచ్చగొట్టే చర్యలను ఎదుర్కోవడంలో భారతదేశ విధానం మరింత చురుకైన, నిర్ణయాత్మక వ్యూహానికి మారిందని, దాని జాతీయ భద్రత విషయంలో రాజీకి అవకాశం లేదని సూచిస్తుంది.ఆపరేషన్ సిందూర్ ముగియలేదని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు. "మనం కొత్త సాధారణ స్థితిలో ఉన్నాం, ప్రపంచం దీనిని అంగీకరించాలి. పాకిస్తాన్ దీనిని అంగీకరించాలి, ఇది యథావిధిగా వ్యాపారం కాదు" అని మోదీ అన్నారు. పాకిస్తాన్ కాల్పులు జరిపితే, భారత్ మిస్సైల్స్‌తో దాడి చేస్తుందని భారత ప్రధానమంత్రి మోదీ గట్టి సందేశం ఇచ్చారు. మళ్లీ పాక్ కాల్పులకు తెగబడితే.. ధీటుగా స్పందించాలని భారత ఆర్మీని ప్రదాని మోదీ ఆదేశించారు. అటు నుంచి గోళీ మన దేశంలోకి వస్తే.. ఇటు నుంచి మిస్సైల్స్‌ను వదలండి అని ఆదేశించారు.

# పాక్ కాల్పుల ఉల్లంఘన

## ప్రధాని మోదీ హైలెవెల్ సెక్యూరిటీ మీటింగ్



**టి మీడియా, మే 11, ఢిల్లీ:** పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ తర్వాత తొలిసారి ప్రధాని నరేంద్ర మోదీ తన నివాసంలో అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ చర్చలు జరిపారు. ఈ అత్యున్నత సమావేశంలో పాల్గొన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ సరిహద్దుల్లో తాజా పరిస్థితిని ప్రధానికి వివరించారు. కాల్పుల విరమణ అవగాహన అనంతర పరిస్థితులపై సమావేశంలో చర్చించారు. కాల్పుల విరమణ ప్రకటించిన గంటల్లోనే ఉల్లంఘించిన పాక్ తీరు చర్చకు వచ్చినట్లు సమాచారం.మరోవైపు సోమవారం మధ్యాహ్నం భారత్, పాకిస్థాన్ మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. సరిహద్దుల్లో కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్ డి జి ఎం ఓ మధ్య చర్చలు జరగనున్నాయి. ఇరుదేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు హాట్‌లైన్‌లో చర్చలు జరుగుతాయని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శనివార సాయంత్రమే ప్రకటించారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తతల తగ్గింపుపై డి జి ఎం ఓ లు చర్చలు జరపనున్నట్లు సమాచారం. షరతులు లేకుండా చర్చలు జరగాలని ఇప్పటికే భారత్ స్పష్టం చేసింది. కాల్పుల విరమణ ప్రాధాన్యతగా ఇందుకు పాక్ అంగీకరించింది. శనివారం భారత్ డి జి ఎం ఓ తో హాట్‌లైన్‌లో మాట్లాడిన పాక్ డీజీఎంవో కాల్పుల విరమణ పాటిద్దామని ప్రతిపాదించారు. 48 గంటల పాటు కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకరించాయి.శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినట్లు భారత్ వెల్లడించింది. ఆ ప్రకటన తర్వాత సరిహద్దు వెంట కొన్నిచోట్ల అవగాహన ఉల్లంఘించిన పాక్ భారత్‌పై డ్రోన్లు పంపింది. వాటిలో కొన్నిటిని భారత బలగాలు కూల్చివేయగా మరి కొన్ని వెనక్కి వెళ్లిపోయినట్లు సైనిక వర్గాలు తెలిపాయి.సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడింది. కాల్పుల విరమణ అవగాహనకు పాక్ తూట్లు పొడిచింది. దీన్ని భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన కొన్ని గంటలకే పాక్ దాన్ని ఉల్లంఘిస్తోందని, ఇది అత్యంత దుర్మార్గమని పేర్కొంది. కాల్పుల ఉల్లంఘనకు పూర్తి బాధ్యత పాక్‌దేనని చెప్పింది. ఈ మేరకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నారు.

# తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

- నేరుగా విద్యార్థుల ఫోన్‌లకే రిజల్ట్స్




**టి మీడియా, మే 11, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఎప్‌సెట్ ఫలితాలు నేరుగా విద్యార్థుల సెల్‌ఫోన్‌కే వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీకి ఈ పరీక్షను జేఎన్‌టీయూ నిర్వహించింది. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షలు పూర్తవ్వగా, మే నెల 2, 3, 4 తేదీల్లో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు. ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో 81,198 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇంజినీరింగ్ విభాగంలో 2.07 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎప్‌సెట్ ఫలితాలు తెలుసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్ https://eapcet.tgche.ac.in/ లోకి వెళ్లి చూసుకోవచ్చు.

### ర్యాంకులు వరుసగా

తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ఫలితాల్లో ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్ చంద్ర మొదటి ర్యాంకు సాధించాడు. రంగారెడ్డి జిల్లా మాదాపూర్‌కు చెందిన ఉదగండ్ల రామచరణ్ రెడ్డి రెండో ర్యాంకు సాధించాడు. మూడో ర్యాంకులో హేమసాయి సూర్య కార్తీక్ ఉన్నారు.

### మెండె లక్ష్మీ భార్గవ్ (నాచారం)కు 4వ ర్యాంకు

మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ (మాదాపూర్)కు ఐదో ర్యాంకు.సుంకర సాయి రిశాంత్‌రెడ్డి (మాదాపూర్)కి ఆరో ర్యాంకు,రష్మిత్ బండారి (మాదాపూర్)కి 7వ ర్యాంకు,బనిబ్రత మాజీ (బడంగ్‌పేట్)కి 8వ ర్యాంకు,కొత్త ధనుష్ రెడ్డి (హైదరాబాద్)కి 9వ ర్యాంకు,కొమ్మ శ్రీకార్తీక్ (మేడ్చల్)కు 10వ ర్యాంకులు వచ్చాయి.

### అబ్బాయిలే టాప్

అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో అబ్బాయిలే పైచేయి సాధించారు. మొదటి పది ర్యాంకుల్లో కేవలం ఒక్క విద్యార్థిని మాత్రమే ఉండటం గమనార్హం. అగ్రికల్చర్, ఫార్మా ఫలితాల్లో సాకేత్‌రెడ్డి (మేడ్చల్)కు మొదటి ర్యాంకు, సబ్బాని లలిత్ వరేణ్య (కరీంనగర్)కు 2వ ర్యాంకు, అక్షిత్ (వరంగల్)కు 3వ ర్యాంకులు వచ్చాయి. సాయినాథ్ ( కొత్తకోట, వనపర్తి)కు 4వ ర్యాంకు,బ్రాహ్మణి (మాదాపూర్)కి 5వ ర్యాంకు,గుమ్మడిదల తేజస్ (కూకట్‌పల్లి)కు 6వ ర్యాంకు,అఖిరానంద్‌రెడ్డి (నిజాంపేట)కి 7వ ర్యాంకు,భానుప్రకాశ్‌రెడ్డి (సరూర్‌నగర్)కి 8వ ర్యాంకు,శామ్యూల్ సాత్విక్ (హైదర్‌గూడ) 9వ ర్యాంకు,అద్దుల శశికిరణ్‌రెడ్డి (బాలాపూర్)కి 10వ ర్యాంకులు వచ్చాయి.



## పర్యాటక రంగంపై...

# ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం

- సొమ్ము వెనక్కి తీసుకుంటున్న టూరిస్ట్‌లు

**టి మీడియా, మే 11, హైదరాబాద్ బ్యూరో :** భారత్, పాకిస్థాన్?ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. హైదరాబాద్ నగరం నుంచి పెద్దఎత్తున ఏటా ఉత్తరాది పర్యటనలకు వెళ్తుంటారు. కశ్మీర్, దిల్లీ, పంజాబ్ సహా మరెన్నో ప్రాంతాలు మనవాళ్లు తరచుగా సందర్శించే ప్రదేశాల జాబితాలో ఉన్నాయి. పహల్గాంలో టూరిస్ట్?లపై ఉగ్రవాదుల కాల్పులతో కశ్మీర్ యాత్రలన్నీ ఇదివరకే రద్దు కాగా ఇప్పుడు దేశ సరిహద్దు ప్రాంతాల యాత్రలపై కూడా ప్రభావం పడింది. భారత్ సరిహద్దు ప్రాంతాలపైకి పాకిస్థాన్ మోర్టార్లు, డ్రోన్లు, క్షిపణులను ప్రయోగిస్తుండటంతో అక్కడికి వెళ్లాలంటేనే పర్యాటకులు అయ్య బాబోయ్ అంటున్నారు. పర్యటనలను రీషెడ్యూల్ చేసుకోవాలని ట్రావెల్ ఆపరేటర్లు సూచిస్తుంటే వద్దు తమకు సొమ్ము వెనక్కి ఇవ్వాలని టూరిస్ట్?లు డిమాండ్ చేస్తున్నారు.

### సొమ్ము వెనక్కి ఇవ్వాలని

పహల్గాం ఘటన తర్వాత పరిస్థితులు సర్దుకున్నాక వెళ్లవచ్చులే అనే ఆలోచనతో కొంతమంది కశ్మీర్ పర్యటనను రీషెడ్యూల్ చేసుకున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మరిన్ని రోజులు ఉద్రిక్త పరిస్థితులనేవి కొనసాగే అవకాశమున్నట్లుగా కనిపిస్తోంది. ఇప్పటికే కశ్మీర్ బుకింగ్స్ పూర్తిగా బంద్ అయ్యాయి. దీంతో పర్యాటకులు తమ పాత బుకింగ్‌లను పూర్తిగా క్యాన్సిల్? చేసి సొమ్ము వెనక్కి ఇవ్వాలని ఆపరేటర్లను కోరుతున్నారు.ప్రత్యామ్నాయంగా జమ్మూలోని వైష్ణోదేవి ఆలయానికి తెలుగు ప్రజలు ప్రతి ఏటా భారీగా వెళుతుంటారు. ముందే బుక్ చేసుకున్న వారు ఇప్పుడు అక్కడికెళ్లేటువంటి పరిస్థితులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు పంపిస్తున్నారు. జమ్మూ స్థానంలో బద్రినాథ్, కేదార్‌నాథ్ యాత్రలను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రావెల్ ఏజెంట్ భాస్కర్‌బాబు వివరించారు. చార్‌ధామ్ యాత్ర అనేది భద్రత నడమ కొనసాగుతుందని చెప్పారు.

### తుర్కియే బాయికాట్

ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్‌కు తుర్కియే దేశం మద్దతు పలకడం వల్ల అక్కడి పర్యాటకాన్ని(టూరిజం) బహిష్కరించాలనే చర్చ దేశంలో మొదలైంది. హైదరాబాద్ నగరం నుంచి ఏటా తుర్కియేకు సుమారు లక్ష మంది వెళుతుంటారని ట్రావెల్ ఏజెంట్లు అంటున్నారు. మన దగ్గర తుర్కియే కాన్సులేట్ ఉన్నటువంటి విషయాన్ని గుర్తుచేస్తున్నారు. పర్యాటకం, వ్యాపారరీత్యా తుర్కియే వెళుతుంటారని ఇంత బిజినెస్ ఇస్తున్నప్పటికీ పాక్‌కు మద్దతు పలకడాన్ని మనవాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారని ఒక ఏజెంట్ వివరించారు.పంజాబ్‌లోని అమృత్‌సర్ స్వర్ణదేవాలయాన్ని(గోల్డెన్ టెంపుల్) చూసేందుకు ఏడాది పొడవునా పర్యాటకులు వెళ్తుంటారు. ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్నటువంటి వాఘా సరిహద్దుకు పర్యాటకులు పోటెత్తుతుంటారు. పాక్ దాడుల నేపథ్యంలో ఆ ప్రాంతాలు మూగబోయాయి.

## కొనసాగనున్న సింధూ నది జలాల

# ఒప్పందం రద్దు

- భారత ప్రభుత్వ వర్గాలు



**టీ మీడియా,మే 11, ప్రత్యేక ప్రతినిధి :** సింధూ నదీ జలాల ఒప్పందం రద్దు నిర్ణయం కొనసాగుతుందని భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందంపై కాల్పుల విరమణ సమయంలో ఎటువంటి ముందస్తు లేదా అనంతర షరతులు లేవని స్పష్టం చేశాయి. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ వివరణ ఇచ్చింది.

### కొన్ని రోజులకు ఉత్కంఠకు తెర

గత కొన్ని రోజులుగా భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులకు శనివారం తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ మేరకు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినట్లు ప్రకటించింది.

### అమల్లోకి సీజ్ ఫైర్

శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఏ) స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంఓకు ఫోన్ చేసిందని చెప్పారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారని వెల్లడించారు. శనివారం సాయంత్రం 5గంటల నుంచి సీజ్ ఫైర్ అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుందని చెప్పారు. మే 12న భారత్, పాక్ డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతాయని వెల్లడించారు.

### సింధూ నదీ జలాల ఒప్పందం అంటే ఏమిటి?

సింధూ, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి వరల్డ్ బ్యాంకు మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఈ డీల్ ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారత్‌కు హక్కులు లభించాయి. సింధూ నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్? లపైపాకిస్థాన్కుహక్కులుదక్కాయి.ఒప్పందం ప్రకారం సింధూ నదీ జలాలను ఒక దేశం మరొక దేశానికి నీటిని కేటాయించాలి. అయితే సింధూ నదీ వ్యవస్థ నుంచి భారత్ 20 శాతం నీటిని, మిగిలిన 80 శాతాన్ని పాకిస్థాన్ ఉపయోగించుకోవచ్చు. అయితే పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో శత్రు దేశం పాక్‌ను దెబ్బకొట్టేందుకు భారత్ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది.

# వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి

- హాజరైన డిప్యూటీ సీఎం పవన్, లోకేశ్, అనిత

3లో..

# ప్రత్యేక పార్లమెంట్ సమావేశం

-ప్రధానికి రాహుల్, ఖర్గేల లేఖ

3లో..

# హాస్పిటల్ కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి





- 3 నుండి 5 సంవత్సరాల వరకు చెల్లుబాటు
- సర్టిఫికేట్ జారికి 7దశలు

**టి మీడియా, మే 11, ప్రత్యేక ప్రతినిధి:** భారతదేశంలో చట్టపరమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాన్ని నడపడంలో ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందడం చాలా ముఖ్యమైన భాగం. ఈ సర్టిఫికేట్ వైద్య, కార్యాచరణ మరియు భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఉందని నిర్ధారిస్తుంది. ఆరోగ్య సంరక్షణ సేవలకు తోడ్పడటానికి ఆసుపత్రిని ఏర్పాటు చేయడం కీలకమైన అడుగు,కానీ ఇందులో వివిధ చట్టపరమైన , నియంత్రణ సమ్మతి అవసరాలను తీర్చడం ఉంటుంది. ఈ ప్రక్రియలో మొదటి, అతి ముఖ్యమైన దశలలో ఒకటి ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందడం . ఈ సర్టిఫికేట్ మీ ఆసుపత్రి ఉనికిని చట్టబద్ధంగా ధృవీకరిస్తుంది. సంబంధిత అధికారులు ఆదేశించిన వైద్య, భద్రత . మౌలిక సదుపాయాల నిబంధనల ద్వారా నిర్దేశించబడిన ప్రమాణాలకు అనుగుణంగా ఉందని నిర్ధారిస్తుంది.

### హాస్పిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ అంటే ఏమిటి?

-ఇది సంబంధిత రాష్ట్ర ఆరోగ్య శాఖ లేదా సంబంధిత నియంత్రణ అధికారం మంజూరు చేసిన అధికారిక అధికారం. భారతదేశంలో పనిచేయడానికి అవసరమైన వైద్య, చట్టపరమైన మరియు మౌలిక సదుపాయాల అవసరాలను ఆసుపత్రి తీరుస్తుందని రుజువుగా పనిచేస్తుంది. ఈ సర్టిఫికేట్ అన్ని ఆరోగ్య సంరక్షణ సంస్థలకు తప్పనిసరి, అవి పెద్ద మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు లేదా చిన్న క్లినిక్‌లు అయినా. ఈ సర్టిఫికేట్ లేకుండా, ఒక ఆసుపత్రి చట్టబద్ధంగా పనిచేయదు మరియు అలా చేయడం వలన జరిమానాలు లేదా మూసివేతకు కూడా దారితీయవచ్చు.

**రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఎందుకు ..?**

ఆసుపత్రి చట్టపరమైన చట్రంలో పనిచేస్తుందని, వైద్య ,, కార్యాచరణ నిబంధనలకు కట్టుబడి ఉండేలా చేస్తుంది. నమోదైన ఆసుపత్రి రోగులు, వైద్య నిపుణులు , బీమా కంపెనీల నుండి నమ్మకాన్ని పొందుతుంది. ఆసుపత్రి ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకోవచ్చు మరియు బీమా ప్రయోజనాలను పొందవచ్చు. లిబీమా అర్హతలి : నగదు రహిత చికిత్సల కోసం భాగస్వామ్యం చేసుకునే ముందు బీమా కంపెనీలు ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేషన్‌ను తప్పనిసరి చేస్తాయి. చట్టపరమైన చర్యలను తప్పించుకోవడం : నమోదుకాని ఆసుపత్రిని నిర్వహించడం వలన తీవ్రమైన జరిమానాలు, చట్టపరమైన సమస్యలు ,మూసివేయబడే అవకాశం ఉంది.

### లైసెన్సులు అనుమతులు అవసరం

సర్టిఫికేట్ పొందడంతో పాటు , ఆసుపత్రి తప్పనిసరిగా పొందవలసిన ఇతర ముఖ్యమైన లైసెన్స్‌లు, అనుమతులు కూడా ఉన్నాయి, వాటిలో: **అగ్నిమాపక భద్రతా ధృవీకరణ పత్రం :** ఆసుపత్రి అగ్నిమాపక భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఉందని నిర్ధారించుకోవడానికి అగ్నిమాపక శాఖ జారీ చేస్తుంది. లిబయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ **అధికారం :** వైద్య వ్యర్థాలను సురక్షితంగా పారవేయడానికి అవసరం. కాలుష్య నియంత్రణ బోర్డు **సర్టిఫికేట్ :** ఆసుపత్రి పర్యావరణ పరిరక్షణ ప్రమాణాలకు కట్టుబడి ఉందని నిర్ధారిస్తుంది. **డ్రగ్ లైసెన్స్ :** ఇన్-హౌస్ ఫార్మసీ ఉన్న ఆసుపత్రులకు అవసరం.

**క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం రిజిస్ట్రేషన్ :** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద పనిచేస్తున్న ఆసుపత్రులకు తప్పనిసరి. **భవన ఆమోద ధృవీకరణ పత్రం :** ఆసుపత్రి మౌలిక సదుపాయాలు భద్రత మరియు నిర్మాణ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని ధృవీకరిస్తుంది. ఈ అదనపు లైసెన్సులు మీ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేషన్‌ను పొందడంలో కీలక పాత్ర పోషిస్తాయి . దరఖాస్తు చేసుకునే ముందు తప్పనిసరిగా అమలులో ఉండాలి. కొన్ని సాధారణ అర్హత అవసరాలు:

### కనీస మౌలిక సదుపాయాలు

నిర్దిష్ట సంఖ్యలో పడకలు, అత్యవసర సౌకర్యాలు, ఆపరేషన్ థియేటర్లు మరియు ఇతర ముఖ్యమైన వైద్య సౌకర్యాలు. అర్హత కలిగిన వైద్య నిపుణులు : లైసెన్స్ పొందిన వైద్యులు, నర్సులు మరియు ఇతర వైద్య సిబ్బంది లభ్యత. అగ్నిమాపక భద్రత మరియు కాలుష్య నియంత్రణకు అనుగుణంగా : స్థానిక అధికారులు నిర్దేశించిన పర్యావరణ భద్రతా ప్రమాణాలకు కట్టుబడి ఉండటం.

### సర్టిఫికేట్ కోసం అవసరమైన పత్రాలు

యాజమాన్యం లేదా లీజు ఒప్పందం,భవన ఆమోద ధృవీకరణ పత్రం,వైద్య సిబ్బంది అర్హతలు,అగ్నిమాపక భద్రతా క్లియరెన్స్ సర్టిఫికెట్,బయోమెడికల్ వ్యర్థాల తొలగింపు ఆమోదం, కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రం. పన్ను రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ( జిఎస్‌టి, మొదలైనవి). ఆన్‌లైన్ లేదా లిఆఫ్‌లైన్ దరఖాస్తును సమర్పించండి

ఆసుపత్రులు హాస్పిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు లేదా ఆరోగ్య శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులను భౌతికంగా సమర్పించవచ్చు. దరఖాస్తు ఫారమ్‌లు మరియు విధానాలు రాష్ట్రం నుండి రాష్ట్రానికి మారుతూ ఉంటాయి, కాబట్టి మీ స్థానిక ఆరోగ్య శాఖ మార్గదర్శకాలను తనిఖీ చేయడం చాలా అవసరం.

### దరఖాస్తు రుసుము

రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందడానికి దరఖాస్తు రుసుములు ఆసుపత్రి పరిమాణం మరియు వర్గం ఆధారంగా మారుతూ ఉంటాయి. రాష్ట్ర నిబంధనలను బట్టి రుసుములు 10,000 నుండి 1,00,000 లేదా అంతకంటే ఎక్కువ ఉండవచ్చు. మీ దరఖాస్తును సమర్పించే ముందు మీరు ఫీజు నిర్మాణాన్ని నిర్ధారించారని నిర్ధారించుకోండి.

### తనిఖీ / ధృవీకరణ

దరఖాస్తు సమర్పించిన తర్వాత, నియంత్రణ అధికారులు ఆసుపత్రిని తనిఖీ చేస్తారు. వారు మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది అర్హతలు, భద్రతా చర్యలు , సంబంధిత నిబంధనలకు అనుగుణంగా ఉన్నారా లేదా అని తనిఖీ చేస్తారు.

### ఆమోదం సర్టిఫికేట్ జారీ

లిఆసుపత్రి అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జారీ చేయబడుతుంది, సాధారణంగా 30-90 రోజుల్లోపు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్ చెల్లుబాటు మరియు పునరుద్ధరణ సాధారణంగా అవుతుంది.

## మదర్స్ డే సందర్భంగా మహిళలకు ఘన సన్మానం



**టీ మీడియా,మే 11,గోదావరిఖని** :రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు,మదర్స్ డే సందర్భంగా ఆదివారం రామగుండం కార్పొరేషన్ పరిధి 14వ డివిజన్ చైతన్యపురి కాలనీలో మహిళలకు శాలువాలతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్,14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్,ముస్తఫా,గట్ల రమేష్,కన్నూరి సాయి తేజ,కన్నూరి తిరుపతి, అంతడుపుల రవి,బిటుసి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆరుముళ్ళ ప్రభాకర్ హాజరై మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళల సేవలను గుర్తుచేసుకుంటూ వారి గొప్పతనాన్ని స్మరించుకున్న ముఖ్యులు,ఈ తరహా కార్యక్రమాలు మహిళల ప్రోత్సాహానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**టి మీడియా, మే 11, పినపాక ప్రతినిధి:** మణుగూరు మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 3,50,000 లక్షల రూపాయల చెక్కులను ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్ , నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి , మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం




**టీ మీడియా,మే11,గోదావరిఖని** :రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురి కాలనీలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆదివారం బిగ్ టీవీ ఆధ్వర్యంలో బి2సి ఫౌండేషన్ వారి సహకారంతో సిగ్మా హాస్పిటల్ వారి డాక్టర్లచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరంలో కాలనీ ప్రజలు,పలువురు మహిళలు వృద్ధులు,వైద్యపరీక్షలు చేయించుకోవడం జరిగింది. ఈ శిబిరంలో కాలనీకి చెందిన వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ మాట్లాడుతూ...కార్యక్రమాన్ని నిర్వహించిన బిగ్ టీవీ యాజమాన్యానికి సహకరించిన బి2సి ఫౌండేషన్ డైరెక్టర్ ఆరుముళ్ల ప్రభాకర్ కి సిగ్మా హాస్పిటల్ వైద్యులకు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. అలాగే ఎమ్మెల్యే సహకారం తో రామగుండం ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందేలా చూస్తాం అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు, రామాలయం చైర్మన్ గట్ల రమేష్,మాజీ కార్పొరేటర్ ముస్తఫా,కన్నురి సాయి తేజ ఎన్సిడబ్ల్యూసి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నూరి తిరుపతి, అంతడుపుల రవి,నాయకులు ఆరేపల్లి సంపత్,రాచపల్లి శ్రీనివాస్,మోతే సురేష్,కల్లేపల్లి రవి,బచ్చల రాజేందర్,సారయ్య,కన్నూరి క్రాంతి చీకటి రాకేష్,తిప్పారపు శ్రీనివాస్ బండ మధుకర్,పాల్గొనడం జరిగింది.



## పలు వివాహా వేడుకలో పాల్గొన్న జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, మే 11, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలో పలు వివాహ వేడుకలలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి. వనపర్తి పట్టణంలోని కళ్యాణ్ సాయి ఫంక్షన్ హాల్ లో సంజీవ రెడ్డి ఆహ్వానం మేరకు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లెల చిన్నారెడ్డి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బంధువులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో జంగిడి లక్ష్మయ్య కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్నారు. వివాహానికి హాజరై,నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ చైర్మన్ నందిమల్ల యాదయ్య , కాంగ్రెస్ నాయకులు, బంధువులు పాల్గొన్నారు. అనంతరం రాంపురం గ్రామంలోని వివాహ వేడుకలో పాల్గొన్నారు. పెబ్బేరు మండలం రాంపురం గ్రామంలో ఆడేం మాసన్న ఆహ్వానం మేరకు కుమారుడు నాగరాజు వివాహ వేడుకలో పాల్గొన్నారు. వివాహానికి హాజరై,నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సహదేవుడు, తోమాలపల్లి మన్నెం,ఈశ్వర్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్దగూడెం గ్రామంలో తెలుగు ఆంజనేయులు ఆహ్వానం మేరకు కుమారుడు వివాహానికి హాజరై,నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండన్న, గోకం వెంకటయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యను పరిష్కరించాలి

- తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



**టీ మీడియా, మే 11, వనపర్తి బ్యూరో :** పీర్లగుట్ట డబల్ బెడ్రూమ్ ఇండ్లలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ గత మూడు నెలల నుండి వనపర్తి పీర్లగుట్ట డబల్ బెడ్రూమ్ కాలనీలో నీటి సమస్య అధికంగా ఉన్నది. దీని కారణంగా ఎత్తు భాగంలో ఉన్న 4, 5, 6,7,8, 9,11 బాక్సులు ఉన్నందున వీరికి నీళ్లు రాకుండా కింది భాగంలో ఉన్న లాకుల వారికి ఎక్కువగా నీళ్లు వాడుతుండడం వల్ల ఇట్టి విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా కమిషనర్ స్పందించి రెండు గేట్ వాల్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గేట్ వాల్సు పెట్టడం వల్ల పైభాగంలో ఉన్న బ్లాక్లో కింది భాగంలో ఉన్న బ్లాక్లోలకు అన్నిటికీ పుష్కలంగా నీరు వెళ్లడం జరిగింది. కాబట్టి టు బిహెచ్కె వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రజలందరూ మున్సిపల్ కమిషనర్ కి కృతజ్ఞతలు తెలియ జేశారు. నీటి సమస్య పరిష్కారం కోసం పీర్లగుట్ట డబల్ బెడ్రూమ్ ఇళ్లను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తాగునీటి సమస్య అని కారణంగా దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ప్రజలకు వివరిస్తూ ఒక గంటన్నర పై భాగాన ఒక గంటన్నర కింది బాగానే ఉన్నా బ్లాక్ లకు నీటిని విడుదల చేస్తారు ఇట్టి విషయాన్ని ప్రజలందరూ కూడా గమనించాలని కోరారు. తాగునీటి కోసం కూడా మూడు మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఇప్పటికీ ఆరో బ్లాకు ముందర ఉన్న కుళాయితోపాటు రెండవ కులాయి మూడవ బ్లాకు దగ్గర మూడవ కులాయి 11వ బ్లాక్ దగ్గర ఏర్పాటు చేస్తారని మాట ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు. ఇట్టి కార్యక్రమంలో రాఘవేంద్ర చారి, ఏవైగిరి, టైలర్ వెంకటేష్, మోహిని దిన్, ప్రశాంత్, నరేష్, డాక్టర్ దప్పు స్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఏఈకి,డిఈకి, లైన్మెన్ ఆంజనేయులు కి మహేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంఘాల బలోపేతం కోసం కృషి

- దయానంద్ ముదిరాజ్



**టీ మీడియా, మే 11, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులతో దయానంద్ ముదిరాజ్ సమావేశం అయ్యారు. వనపర్తి నియోజక వర్గంలో ముదిరాజ్ తెలుగు మత్స్యకారుల సంఘాల బలోపేతం అంశంపై కుల సంఘ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా కొన్ని అంశాలను దృష్టి కి తీసుకొచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నాయి మా జీవితాలు మారట్లేదు. ఒక్క మత్స్య పారిశ్రామీక సహకార సంఘంలో 400 పైగా కుటుంబ సంఘ సభ్యులు ఉన్నారు. మత్స్యకార సభ్యులకు చెరువు, కుంటల్లో చేపలు పట్టడం పై పూర్తి హక్కులను ప్రభుత్వాలు కల్పించాలి. మత్స్యకారులకు పడవలను అంద జేయాల్సిందిగా కోరుతూ జాకెట్స్, వలలూ, భవన సంఘ నిర్మాణానికి ఆర్థిక నిధులను మంజూరు చేయాలని, ప్రమాద బీమా ఇవ్వాలనీ, వ్యాపార ఆర్థిక సబ్సిడీ రుణాలను కల్పించాలి. గత ప్రభుత్వంలో వాహనాలు సబ్సిడీ రూపంలో ఇచ్చారు. ఒకే సంఘం ఒకే మాటగా జాతి అభివృద్ధికి ముందుకు సాగుదామని సంఘంలో యువత భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, సెక్రటరీ రంగ స్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నాగేంద్రం,రామన్న, శ్రీను, రంగం బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సేవ చేసుకునే గొప్పతనం అమ్మది

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**టీ మీడియా, మే 11, వనపర్తి బ్యూరో :** సాక్షాత్తు పరమాత్ముడే పాద సేవ చేసుకునే గొప్పతనం అమ్మదని అలాంటి అమ్మను గౌరవించుకుని పూజించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తన ప్రాణం పణంగా పెట్టి మనకు ప్రాణం పోసి ప్రయోజకులను చేసిన అమ్మలను అనాథలుగా వదిలేయరాదని ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించి వారి ఆఖరి రోజుల్లో అండగా ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో కన్న తల్లిదండ్రులను కనుక్కున్న బిడ్డలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచి తల్లిదండ్రుల పట్ల భక్తి శ్రద్ధలతో, వినయ విధేయతలతో ఉండేలా చూడాలన్నారు.

## రక్షణ నిధికి నెల జీతం హర్షనీయం



**టి మీడియా, మే 11, పినపాక ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారత సాయుధ దళాలకు ఒక నెల వేతనం విరాళం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య అభినందనలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,భారత్-పాకిస్తాన్ ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో,తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ సరిహద్దులను కాపాడుతూ, ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో వీరోచితంగా పోరాడుతున్న భారత సాయుధ దళాలకు మద్దతుగా తెలంగాణ ముఖ్యమంత్రి , మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీ లు భారత సాయుధ బలగాలకు సహకారంగా ,ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇవ్వడం హర్షణీయమన్నారు. దేశం కోసం ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడుతున్న దళాలకు ప్రతి ఒక్క భారతీయుడు మద్దతు తెలిపి అండగా నిలబడాలన్నారు. జాతీయ రక్షణ నిధికి విరాళం అందజేసి అండగా నిలిచి గొప్ప మనసు చాటుకున్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు, ఎమ్మెల్సీ లకు కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, నాయకులు భద్రారెడ్డి, ఆవుల రవి, బేతం బాబు, సామకూరి వెంకన్న, బారాజు సంపత్, హర్ష, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఆర్జేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**టి మీడియా, మే 11, ఖమ్మం:** నగరం లోని ఆర్జేసి డిగ్రీ కళాశాల 2000-2003 బిఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు పలుకరించుకుటూ సందడి చేశారు. ఆటపాట లతో ఉత్సాహం గా గడిపారు. ఒక్కసారి గా చిన్న పిల్లలు గా మారి పోయి డ్యాన్స్ లతో హుషారు గా గడిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరు కాగా విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొంటూ ఉల్లాసం గా గడిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్ లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. తమ కళాశాల నుండి. ఇప్పటి వరకు 25 వేల మంది విద్యార్థులుబయటకు వెళ్ళి వివిధ రకాల ఉద్యోగాలలో స్థిర పడటం అభినందనీయం అన్నారు. తమ విద్యార్థులు సేవా రంగంలో ఎల్ల వేళలా ముందుటారని తెలిపారు. ఆర్జేసి కళాశాల అంటే క్రమ శిక్షణ కు మారుపేరని తెలిపారు. దీనిని భవిష్యత్ లోనూ చెప్పు కొనేలా విద్యార్థులు మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ శ్రీనివాస రెడ్డి, బోటనీ లక్ష్మణ్ రావు,ఆర్జేసి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. లింగయ్య, పూర్వ విద్యార్థులు రామారావు, నాగమణి, చైతన్య, సుప్రియ, వెంకటేశ్వర్లు,సాగర్ తదితరులు పాల్గొన్నారు...



## ఘనంగా మాతృ దినోత్సవం

**టీ మీడియా,మే 11,గోదావరిఖని :** గోదావరిఖని బస్టాండ్ వద్ద గల నైట్ షెల్టర్ లో తాజా మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ తన తల్లి స్వర్గీయ కన్నూరి సౌందర్యమ్మా ను స్మరిస్తూ అక్కడి పెద్దమ్మల నడుమ కేక్ కట్ చేసి మాతృ దినోత్సవం ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కన్నూరి సతీష్ కుమార్ తన తల్లి స్వర్గీయ కన్నూరి సౌందర్యమ్మా జ్ఞాపకర్థం అక్కడి పెద్దమ్మలను శాలువాలతో సన్మానించి, వారికి ప్యాకెట్ మని ని ఆప్యాయంగా అందించారు. ఈ కార్యక్రమం నిర్వహించడంకు సహకరించిన జ్యోతి గాంధీ ఫౌండేషన్ నిర్వాహకులు సామజిక వేత్త దయానంద్ గాంధీ ని శాలువా తో సన్మానించారు. ఈ సందర్భంగా కన్నూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ...మా అమ్మ కన్నూరి సౌందర్యమ్మా తలుచుకుంటూ మాతృ దినోత్సవం ఇలా పెద్దమ్మల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని, సమాజంలో నలుగురికి సాయపడుతూ నవ్వుతు ఉండాలి,నిజాయితీ గా ముందుకు పోవాలి అనే మా అమ్మ మాట తో వీలైనంత సామజిక బాధ్యత తో ముందుకు సాగుతానని అన్నారు. ఈ కార్యక్రమం లో మిత్రులు పూదరి శ్రీనివాస్, ఎస్ కె ఇంతియాజ్,సిరికొండ కోటి, నైట్ షెల్టర్ ఇంచార్జి బి సమ్మయ్య,జ్యోతిగాంధీ ఫౌండేషన్ ప్రముఖులు దయానంద్ గాంధీ పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ భూ నిర్వాసితులతో అధికారుల చర్చలు

- పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వాలి: నిర్వాసితులు



**టీ మీడియా,మే 11, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి మండలం భాగ్యనగర్ తండా సబ్ స్టేషన్ భూ నిర్వాసితులతో విద్యుత్ అధికారులు ఆదివారం కొత్త లింగాల సబ్ స్టేషన్ లో చర్చలు జరిపారు. చర్చలలో విద్యుత్ డీఈ రామారావు, ఏడీఏ ఆనంద్ నిర్వాసితులు లాకావత్ లక్ష్మీ, వాంకుడోత్ కళ్యాణ్, మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బన్సీలాల్ లు పాల్గొన్నారు. సబ్ స్టేషన్ కు స్థలం ఇచ్చిన నిర్వాసితునికి ఆపరేటర్ పోస్టు ఇవ్వటానికి సుముఖంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఫైలు సీఎండీ దగ్గర ఉందని, ఆపరేటర్ పోస్ట్ కు ఒప్పుకుంటే వెంటనే నియామకపు ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని అధికారులు నిర్వాసితులకు గ్రామ పెద్దలకు వివరించారు. సబ్ స్టేషన్ నిర్మాణం సమయంలో కూడా ఆపరేటర్ పోస్ట్ ఇస్తామని చెప్పిన దానికి అనుగుణంగానే పోస్ట్ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. భాగ్యనగర్ సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా కు ఆటంకం లేకుండా చేయాలని దీనివల్ల ఎనిమిది గ్రామాల ప్రజలు లోవోల్టేజీతో ఇబ్బంది పడుతున్నారని అధికారులు వివరించారు.

### పర్మినెంట్ పోస్ట్ ఇవ్వాలి

సబ్ స్టేషన్ కు 14 గుంటల విలువైన భూమిని ఇచ్చామని, తమకు పరిహారంతో పాటు ఉద్యోగం ఇస్తానని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారని నిర్వాసితులు తెలిపారు. ఇప్పటివరకు పరిహారం కానీ, ఉద్యోగం కానీ ఇవ్వకుండా తాత్సర్యం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు విద్యుత్ శాఖలో పర్మినెంట్ పోస్టు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీంతో చర్చలు సఫలీకృతం కాలేదు ఈ చర్చలలో కారేపల్లి క్రాస్ రోడ్, కొత్తలింగాల సబ్ స్టేషన్ ఏఈలు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు కామేపల్లి ఎస్సై గ్రామ పెద్దలు ఆలోత్ మోహన్, భూక్య యుగంధర్ లు పాల్గొన్నారు

# విత్తనాలు కొనేటప్పుడు చూసుకోండి

- లేకపోతే తీవ్రంగా నష్టపోతారు
- మార్కెట్‌లో నకిలీ విత్తనాలు

**టి మీడియా, మే 11, ప్రత్యేక ప్రతినిధి: :** రైతులకు వానాకాలం ముందుగానే వస్తుండటంతో సీజన్‌కు ముందుగానే పంట పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆకాల వర్షాలు కురవడంతో మంచి పదును అవుతుండటంతో దుక్కులు దున్నేస్తున్నారు. అయితే మే 27 నుంచి నైరుతి రుతుపవనాలు కేరళను తాకతాయని వాతావరణ శాఖ మంచి శుభవార్త చెప్పింది. ఈ క్రమంలో అవి రాష్ట్రానికి చేరుకోవడానికి జూన్? మొదటి వారం కావచ్చు. జూన్ మొదటి వారంలో వానాకాల సీజన్‌ప్రారంభం అవుతుంది. ఈ నేపథ్యంలో రైతులు విత్తనాలు కొనడానికి మార్కెట్లకు వెళుతూ ఉంటారు. అయితే కొనేముందు వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలకు కళ్లెం వేయొచ్చు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా పంట దిగుబడి, పంట కాలం వృథా అయ్యే ప్రమాదంతో పాటు రైతు అప్పులపాలు అవ్వడం ఖాయం.






**విత్తన ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్**

కమీషన్ల కక్కుర్తిలో పల్లెల్లో అనధికారికంగా విత్తనాలు అమ్మే వారు రైతులకు నకిలీ విత్తనాలను అంటగడతారు. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. కొందరు రైతులు ఓ పత్తి విత్తన కంపెనీ నుంచి ఫౌండేషన్? తీసుకుని సాగు చేసిన వారికి చేదు అనుభవం ఎదురైంది. వరి విత్తనాల్లో కంకి బయటకు వచ్చే దశలో కానీ దాని స్వరూపం బయటపడదు. మొక్కజొన్న, వేరుశెనగ పంట పూర్తయితే కానీ నకిలీ వల్ల జరిగిన నష్టం రైతుకు అర్థం కాదు. ముఖ్యంగా పత్తి, వరి, మిరప, మొక్కజొన్న వంటి విత్తనాల్లో నాసిరకం హవా ఎక్కువగా సాగుతోంది. అందుకే విత్తనాలు కొన్న రైతులు కచ్చితంగా రసీదు, క్యూఆర్? కోడ్ స్కాన్ చేయడం అలవాటు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తుంటారు.

**ఇవి తప్పనిసరి తెలుసుకోవాలి**

లైసెన్స్ ఉన్న అధీకృత దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన మొలక శాతం సరిగా ఉందో లేదో చూసుకోవాలి. విత్తన ప్యాకెట్లపై లాట్‌నంబర్, ప్యాకింగ్ తేదీ, లేబుల్ తదితరాలను పరిశీలిస్తూ ఉండాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దాన్ని మొబైల్‌తో స్కాన్ చేస్తే విత్తనాలకు సంబంధించిన పూర్తి వివరాలు అనేవి ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం అవుతాయి. నాటే కంటే ముందే కొన్ని విత్తనాలు తీసుకొని మొలక శాతం పరీక్షించుకోవాలి. ముఖ్యంగా విత్తన సంచులు, రసీదులను భద్రపరుచుకోవడం మంచిది. తెలిసిన షాపులో విత్తనాలు కొంటే ఇంకా మంచిది. ఉదాహరణలు గతేడాది గద్వాల మండలానికి చెందిన రైతు పత్తి సాగు చేయగా విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పత్తి ఏపుగా పెరిగినా కాయ కాయలేదు. దీంతో రెండెకరాల్లో రూ.3 లక్షల వరకు నష్టాన్ని చవిచూశాడు. అలాగే వనపర్తి జిల్లాకు చెందిన ఓ రైతు నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశారు. కంపెనీ విత్తనమేనంటూ కొనుగోలు చేసి నాటారు. తీరా చూస్తే ఏముంది దిగుబడి రాలేదు. కొనుగోలు సమయంలో రసీదు తీసుకోకపోవడంతో ఆయన నష్టపోయారు.



## ఘనంగా గ్రామ దేవతల ప్రతిష్ట

**కుల,మతాలకతీతంగా ఐక్యతను చాటుకున్న కాలనీవాసులు**

**టీ మీడియా,మే 11, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి మండలం శ్రీ వెంకట సాయినగర్ లో గ్రామదేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి, తో పాటు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నోముల ఆదినారాయణ, అక్కినపల్లి సంపత్ ఆచార్యులు, చింతోజు బ్రహ్మచారి, వెంకటస్వామి, వారి శిష్య బృందం చే మంత్రోచ్చారణ నడుమ విగ్రహ ప్రతిష్ట మహెూత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సాంస్కృతిక నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ భక్తి పారవశ్యాన్ని ప్రదర్శించారు. కుల మతాలకు అతీతంగా కాలనీవాసులు అందరూ చందాలు వేసుకొని దేవుడి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవత విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంతో వెంకట సాయినగర్ లో పండుగ వాతావరణం సంతరించుకుంది. ప్రతిష్ట కార్యక్రమం అనంతరం కాలనీలో మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం గ్రామదేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని.. శ్రీ వెంకటసాయి నగర్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చాందావత్ లక్ష్మణ్, ఈసం భాస్కర్ లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాంబాబు, నాగేశ్వరరావు, రామారావు, దుర్గయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పార్లమెంట్ సమావేశం

**ప్రధానికి రాహుల్, ఖర్గేల లేఖ**

**టీ మీడియా, మే 11,ఢిల్లీ:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల తాజా పరిణామాలపై చర్చించేందుకు వెంటనే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత ఖర్గేలు ప్రధాని మోడీకి లేఖ రాశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, సరిహద్దు కాల్పుల్లో తాజా పరిణామాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని లేఖలో పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించేందుకు పార్లమెంట్ ఉభయ సభలు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాల ఏకగ్రీవ అభ్యర్థనను నేను పునరుద్ఘాటిస్తున్నాను. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ మరియు అమెరికా అధ్యక్షులు ట్రంప్ మొదట ప్రకటించిన కాల్పుల విరమణపై ప్రజల తరపున వారి ప్రతినిధులుగా చర్చించడం చాలా ముఖ్యం. రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి మన సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి కూడా ఇది ఒక అవకాశం అవుతుంది. ఈ డిమాండ్‌ను మీరు తీవ్రంగా మరియు త్వరగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాను " అని రాహుల్‌గాంధీ తన లేఖలో పేర్కొన్నారు. తాజా పరిణామాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే అన్ని ప్రతిపక్ష పార్టీల ఏకగ్రీవ అభ్యర్థన గురించి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పటికే మీకు లేఖ రాశారు. మొదటి వాషింగ్టన్ డిసి నుండి తరువాత భారత్, పాక్ ప్రభుత్వాల నుండి కాల్పుల విరమణ ప్రకటనలు వెలువడ్డాయని ఖర్గే లేఖలో పేర్కొన్నారు.




## ముగ్గురు మంత్రులు సమీక్షలు

- సీతారామ ,పాలేరు అనుసంధానం అడుగు పడ లేదు
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్

**టీ మీడియా, మే 11,ఖమ్మం:** ఉమ్మడి ఖమ్మం జిల్లా లో సాగర్ ఆయకట్టు తో కలిపి ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు ముగ్గురు మంత్రులు ఉన్న అడుగు ముందుకు పడడం లేదు అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. ఆదివారం ఖమ్మం సుందరయ్య భవన్ లో మాది నేని రమేష్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ మంత్రులు సమీక్ష సమావేశాలు నిర్వహించడం తప్ప బడ్జెట్ లో నిధులు కేటాయింపులు మాత్రం చాలా తక్కువగా ఉన్నాయి అన్నారు. ప్రాజెక్ట్ ప్రధాన కెనాల్ పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్ అనుసంధానం పనులు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఖమ్మం జిల్లా లో సాగు నీరు సమస్యలు మరింత వచ్చే అవకాశం ఉందని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయుటకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లాగా రబీ సీజన్ ధాన్యం క్వింటాక 67 కేజీ ల బియ్యం ప్రభుత్వం కి మిల్లర్ల అందించాలనే నిభందనలు వల మిల్లర్ల రబీ సీజన్ ధాన్యం నూకలు శాతం ఎక్కువ గా వస్తాయి గిట్టుబాటు కావడం లేదు అంటే ప్రభుత్వం మొండి గా వ్యవహరించడం తో మిల్లర్ల రైతులు ధాన్యం క్వింటాళ్ల కు ఐదు నుంచి పది కేజీలు తరుగు పేరుతో కట్టింగ్ చేస్తున్నారు అని రబీ సీజన్ ధాన్యం నుంచి ప్రభుత్వం రిటన్ బియ్యం ఖరీఫ్ సీజన్ కంటే తక్కువ తీసుకోవాలి అని డిమాండ్ చేశారు తరుగు పేరుతో రైతులు నుంచి కట్టింగ్ చేయుటకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకుండా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు, అకాల వర్షాలు వస్తున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా లో ధాన్యం కొనుగోలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి అని కోరారు ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మీరా, గోడవర్తి నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, సహా కార్యదర్శులు రచ్చా నరసింహారావు,బిక్కసాని గంగాధర్, మహిళా రైతు జిల్లా కో కన్వీనర్లు బొంతు సమత, గూడూరి ఉమా, తుళ్ళూరు రమేష్, మల్లెంపాటి రామారావు దొండపాటి నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు,కుసుపూడి మధు తదితరులు పాల్గొన్నారు




# వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి

- హాజరైన డిప్యూటీ సీఎం పవన్, లోకేశ్, అనిత

**టి మీడియా, మే 11, సత్యసాయి జిల్లా :** సత్యసాయి జిల్లా కల్లితండాలో వీరజవాను మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. మురళీనాయక్ కుటుంబం వద్దకు మంత్రులు పవన్, లోకేశ్, సవిత, అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఇతర ప్రముఖులంతా హాజరయ్యారు. వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు హామీ ఇచ్చారు. మురళీనాయక్ తండాగా మారుస్తాం: మురళీనాయక్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం తరపున అందిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. మురళీనాయక్ పార్థివదేహానికి నివాళులర్పించడానికి వచ్చిన లోకేశ్ కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అదే విధంగా జిల్లాలో మురళీనాయక్ స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అంతేకాకుండా మురళీనాయక్ తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించినట్లు లోకేశ్ అన్నారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు కల్లితండాను మురళీనాయక్ తండాగా మారుస్తామని లోకేశ్ పేర్కొన్నారు. చిన్న వయసులో మురళీనాయక్ మృతి బాధాకరమని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

**కుటుంబానికి అండగా ఉంటాం**

మురళీనాయక్ కుటుంబానికి ఐదెకరాల పొలంతో పాటు మరో 300 గజాల ఇంటి స్థలాన్ని అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. మురళీనాయక్ పార్థివదేహానికి నివాళులర్పించడానికి కళ్లితండాకు వచ్చిన పవన్ మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షల వ్యక్తిగత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మురళీ కుటుంబానికి ఎలాంటి సాయం కావాలన్నా తమ మూడు పార్టీలు సిద్ధంగా ఉంటాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. మురళీనాయక్ కుటుంబానికి భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నానని పవన్ ఆకాంక్షించారు.





**అడుగడుగునా నీరాజనాలు**

అంతకుముందు అడుగడుగునా నీరాజనాలతో యువ జవాన్ మురళీనాయక్ భౌతికకాయం స్వగ్రామానికి చేరుకుంది. ప్రతిగ్రామం, ప్రతి కూడలి వద్దకు వేల సంఖ్యలో ప్రజలు చేరుకుని సైనికుడికి పూల జల్లులతో వీడ్కోలు పలికారు. మంత్రి సవిత పర్యవేక్షణలో ప్రజలు భారీ కాన్వాయ్‌గా ఏర్పడి జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తూ భౌతికకాయాన్ని తరలించడంతో, బెంగళూరు నుంచి కళ్లితండాకు 90 నిమిషాల ప్రయాణం 8 గంటలు పట్టింది. పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెండు ఎకరాల్లో భూమిని చదును చేసి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, సత్య కుమార్ యాదవ్, అనిత, సవిత, అనగాని సత్యప్రసాద్, తదితరులు మురళీనాయక్ భౌతికకాయానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ గ్రామంలోనే ఉన్నారు.

# యథేచ్ఛగా లేటరైట్ తవ్వకాలు

- భారీ వాహనాలతో తరలింపు
- చోద్యం చూస్తోన్న అధికార యంత్రాంగం

**టీ మీడియా, మే 11,%-%అనకాపల్లి ప్రతినిధి :** ఎర్ర బంగారంగా పేరొందిన కోట్ల విలువైన లేటరైట్‌ను మైనింగ్ మాఫియా ఇష్టానుసారం తవ్వుకుపోతోంది. దగ్గరుండి తవ్వకాలు చేయిస్తున్నది జిల్లాలో అధికారి పార్టీకి చెందిన కీలకమైన వ్యక్తి కావడంతో అధికార యంత్రాంగం చేష్టలుడిగింది. ఇచ్చిన అనుమతులు ఎక్కడో, తవ్వుతున్నది ఎక్కడో గుర్తించి తేడా ఉంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభమైన లేటరైట్ అక్రమ తవ్వకాలు టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. మైనింగ్ మాఫియాకు గతంలో వైసిపి అండగా ఉండగా, ఇప్పుడు టిడిపి అండగా నిలిస్తోంది. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోట పంచాయతీ భమిడికిలద్దిలో జర్తా లక్ష్మణరావు అనే గిరిజనుడికి అన్ సర్వేడ్ ల్యాండ్‌లో 296.34 ఎకరాల్లో లేటరైట్ తవ్వకాలకు ప్రభుత్వం 2041వ సంవత్సరం వరకు అనుమతులు మంజూరు చేసింది. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఖనిజ తవ్వకాలకు గిరిజనేతరులకు అవకాశం లేకపోవడంతో గిరిజనుడైన లక్ష్మణరావును అడ్డంపెట్టుకొని మైనింగ్ మాఫియా రంగంలోకి దిగింది. పీసా, 1/70 చట్టాలను ఉల్లంఘించింది. గ్రామసభలు నిర్వహించి ఆమోదం పొందాలన్న నియమం పాటించలేదు. గత ప్రభుత్వ కాలంలో చెలరేగి తవ్వకాలు చేపట్టిన మైనింగ్ మాఫియాకు గిరిజనుల ప్రతిఘటన, న్యాయపరమైన సమస్యలతో తవ్వకాలకు కొంత ప్రతిబంధకం ఏర్పడింది. ప్రభుత్వం మారడంతో మైనింగ్ మాఫియా కూడా మారింది. గత ప్రభుత్వానికి అనుకూలురైన వ్యాపారుల స్థానంలో ఇప్పుడు ఈ ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో మెలిగే మైనింగ్ వ్యాపారులు తవ్వకాలు చేస్తున్నారు. నర్సీపట్నానికి చెందిన ఒక వ్యాపారి ప్రధాన సూత్రధారిగా ఉన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ, గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులెవరిలోనూ లేటరైట్ అక్రమ తవ్వకాలపై చలనం లేకుండా ఉంది. లేటరైట్ అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తోన్న నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో ఉంది. అక్రమ రవాణా కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మీదుగా సాగుతోంది. రోజుకు కనీసం రెండు వేల టన్నులకుపైగా లేటరైట్‌ను యంత్రాలతో తవ్వి, భారీ వాహనాల్లో రౌతులపూడి మండలం జలదం వద్ద ఏర్పాటు చేసిన క్రషింగ్ ప్రదేశానికి తరలిస్తున్నారు. అక్కడి నుంచి రావికంపాడు రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వేర్వేరు మార్గాల్లో పంపిస్తున్నారు. లేటరైట్ తవ్వకాల లీజు వసూలు వివరాలు, రాయల్టీ కింద జమైన డబ్బుల వివరాలు గనులు, భూగర్భ శాఖ నర్సీపట్నం డివిజన్ కార్యాలయంలో అందుబాటులో లేవు. ప్రస్తుతం లేటరైట్ తవ్వుతున్న నాగులకొండ నుంచి లేటరైట్ క్రషింగ్ ప్రదేశం జలదం వరకు అటవీ శాఖ అనుమతుల్లేకుండా చెట్లు నరికి భారీ రహదారి ఏర్పాటు చేసుకున్నా అటవీ శాఖాధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. లేటరైట్ తవ్వకాల ఫీజు, రాయల్టీ విషయమై గనులు, భూగర్భశాఖ నర్సీపట్నం డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ శివాజీని 'ప్రజాశక్తి' వివరణ కోరగా హెక్టార్‌కు ఏడాదికి రూ.26 వేలు, రాయల్టీ కింద టన్ను ఒక్కంటికీ రూ.150 చొప్పున రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి చెల్లిస్తుండడంతో ఆ వివరాలు తమవద్ద లేవని చెప్పారు. లేటరైట్ తవ్వకాలతో తమకు సంబంధంలేదని, అనుమతులు ఇవ్వడం వరకే తమ పని అని తెలిపారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ

**-అధికారులు నిర్లక్ష్యం**

**టీ మీడియా, మే 11,దుబ్బాక :** ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు అమ్ముకుని లబ్ధి పొందడానికి కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించి వారికి నిరాశే మిగులుతుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొందరు తమ అక్రమార్జన అనువుగా మలుచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీన్ని అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతో అన్నదాతలు నిట్ట నిలువు దోపిడీకి గురవుతున్నారు. రైతులకు సరిపడా గన్ని బ్యాగులు అందించకపోవడం వల్ల తూకాల్లో జాప్యం, లారీల కొరత కారణంగా ఆశించిన స్థాయిలో ధాన్యం కొనుగోలు జరగడం లేదు .దీనికి తోడు అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. దొడ్డు రకం ధాన్యం క్వింటాల్ కు రూ.2320, సన్న రకం ధాన్యానికి రూ.2320 తో పాటు అదనంగా రూ.500 బోనస్ ను ప్రభుత్వం ప్రకటించింది. గోనెసంచులు సరిపడ లేకపోవడం, తేమ యంత్రాలు సరిగా పనిచేయక అకాల వర్షాలతో కొనుగోలు జాప్యం చేయడంతో కేంద్రాల్లో ధాన్యపు రాశులు పేరుకుపోయాయి. మరోవైపు దోపిడీ మాత్రం ఆగడం లేదు. కొందరు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతుల నుంచి 100 బస్తాలకు ఒక డబ్బా, ఆ పైన బస్తాలకు ఒక సంచి వడ్లు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. తామేమి తక్కువ కాదన్నట్టు హమాలీలు కూడా అదనంగా వడ్లు లేకపోతే నగదు వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. వాస్తవానికి ధాన్యం బస్తా 41 కిలోలు తూకం వేయాల్సి ఉండగా.. 41.200 కిలోలు తూకం వేస్తున్నారు. ఈ లెక్కన క్వింటాకు అరకిలో దగా చేస్తున్నారు. దీనికి తోడు లారీ డ్రైవర్లు మామూళ్ల పేరుతో ఒక బస్తా పై రెండు రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. మరి కొంతమంది కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైస్ మిల్లర్ల గుమాస్థలతో కుమ్మక్కై తాలూ, తరుగు, తేమ పేరుతో లారీకి ఇంత అంటూ కోత విధిస్తున్నారని చెప్పి తూకంలో తేడా చూపించి ఇరువురు పంచుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్ర వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయలేని పరిస్థితుల్లో డబ్బులు ఇవ్వక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా సంబంధిత అధికారులు అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు. ఇలా రైతుల కష్టార్జితాన్ని రూ.కోట్ల రూపంలో కొనుగోలు కేంద్రాలు నిర్వాహకులు,రైస్ మిల్లర్లు దోపిడీ చేస్తున్నారు. అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



# 13 నుంచి పాలిసెట్ పరీక్షలు

**టీ మీడియా, మే 11,హైదరాబాద్:** పాలిటెక్నిక్ ఎంట్రన్స్-2025 పాలీసెట్ పరీక్షలను రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ లలోని 3 సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా.. వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికై ఈనెల మే 13వ తేదీ మంగళవారం రోజున ఉ. 11.00 గం. నుండి మ. 1.30 వరకు రాష్ట్ర వ్యాప్తం గా నిర్వహించుటకై నిబంధ నల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. పాలీసెట్-2025 కు రాష్ట్ర వ్యాప్తంగా 1,06,716 మంది అభ్యర్థులు 276 పరీక్ష కేంద్రాలలో హాజర వుతున్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి ఒక గంట ముందుగానే అనుమతిస్తారు. కాబట్టి విద్యార్థులు ఉ.10.00 గంటలకే పరీక్ష హాలులోకి చేరుకొని ఓ ఎమ్ ఆర్ షీట్ లోని రెండు వైపుల వివరాలను పూర్తి చేసి సంతకం చేయవలసి ఉంటుంది. విద్యార్థులు తమ వెంట బ్లాక్ పెన్సిల్, ఏరేసర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావాలని సూచించారు పరీక్ష ప్రారంభం అయిన ఉ 11.00 గం.తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయిన అభ్యర్థిని పరీక్ష కేంద్రం లోనికి అనుమతించబ దరు. హాల్ టికెట్ మీద ఫోటో ప్రింట్ కానివారు ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటో, ప్రూఫ్ (ఆధార్ కార్డు) తెచ్చుకోవలెను. అలాగే పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కానీ అనుమతించబడవు. ఇక ఇంజనీరింగ్ డిప్లొమా చేయాలనుకునే వారు గణితం 60 మార్కులు, భౌతిక శాస్త్రం 30 మార్కులు, రసాయన శాస్త్రం 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుంది. వ్యవసాయం, ఉద్యానవన, వేటరినరీ డిప్లొమా చేయాలనుకునే వారు అదనంగా జీవశాస్త్రంలో మరో 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుంది .

